# సూట్‌కేస్

దవనం, సోడా, అరటిపళ్ళు, కిళ్ళీ, సిగరెట్లు, అమ్మేవాళ్ళు ప్లాట్ ఫారం అంతా కోలాహలం చేస్తున్నారు. బండి కదలడానికి ఇంకా అయిదు నిముషాలు వ్యవధి వుంది

పెట్టె కిటికీలోంచి తలపెట్టి సుభద్ర దవనం కుర్రాణ్ణి కేకేసింది.

“ఎందుకూ దవనం?”

సుభద్ర తలలో దవనమూ, మల్లెపూలూ క్రిక్కిరిసి ఉండనే వున్నై.

“మీ కోసం.”

రామదాసుకు సంతోషపు నవ్వూ, తృప్తీ వొచ్చాయి

“వొద్దు. నువు లేకుండా అలాంటి వాటిని నేను చూట్టం కష్టం” అన్నాడు.

సుభద్ర వో అణా దవనం కొంది, రామదాసు వొద్దంటున్నా.

“మీ పర్సు జాగర్త పెట్టుకున్నారా?”

“వకీలుగారి కిచ్చేది దస్తావేజులతో దాచాను. మిగతా వందా జేబులో” అన్నాడు రామదాసు, ఆడవాళ్ళకు ఉన్న అధిక శ్రద్ధకు మెచ్చుకుంటూ.

"ఇదుగోనండోయ్, మీ మతిమరుపుతో సూట్ కేస్ పారేసుకునేరు! సమస్తమూ ఇందులో ఉన్నై."

"ఛ!"

"ఛా లేదు, ఛీ లేదు! మన ఆస్తి అంతా ఇందులో ఉంది."

"నాకు తెలీదుటే—" సుభద్రను రామదాసు దగ్గిరికి లాక్కోబోయాడు. నిగ్రహించుకున్నాడు.

"లక్ష్మయ్యగారిని రేపు కలుస్తారా?"

"వాయిదా ఇంకా నాల్రోజులు ఉందిగదా. ఆc. రావటానికి ఓ వారం పట్టొచ్చు."

"వారం రోజులే?"

"ఏం, ఏం?"

"నే నొక్కత్తెనూ ఉండలేనమ్మా!"

రామదాసు నవ్వాడు.

"అక్కడ ట్రాములూ, కార్లూ, నడవడం చాలా కష్టం అన్నారు.... జాగర్తగా నడుస్తారా? చేతిలో చేయివేయండి."

"మరి నువు నీళ్ళు తోడేప్పుడు గాడినుయ్యి "తాగాడు" మీద కాలేసి తోడ్తావుగదా....జాగర్తగా తోడుతానని మీ హిందీలో చేతిలో చెయ్యివెయ్యి."

సుభద్ర ఫక్కున నవ్వింది. సుభద్ర కాపరానికొచ్చిన కొత్తలో గాడి నూతిలో పడ్డది. ఫక్కున నవ్విందన్న మాటేగాని—వెనకటి స్మరణవల్ల మొహం కొద్దిగా రంగుమారింది.

రైలు కూతేసింది. సుభద్ర జాగర్తలు మరీమరీ చెబుతూ కిందకు దిగింది. గార్డు యీల వేశాడు. బండి చీమలా కదిలింది.

"బిదా లేతాహుఁ" అంది సుభద్ర ముద్దుగా కనుకొలుకుల్లోకి చూస్తూ.

"అచ్ఛా" అంటూ రామదాసు నవ్వాడు.

బండి బాగా కదిలింది.

చెయ్యీ చెయ్యీ కలిపి సుభద్ర ప్లాట్ ఫారం మీద పది అడుగులు నడిచింది. సుభద్ర తల దూరంగా కనిపించేదాకా రామదాసు చూసి, చెయ్యి ఊపి, ఆలోచనల్లో పడ్డాడు.

పర్సులో టిక్కెట్టు పెట్టి, పర్సు కోటు లోపలి జేబులో పెట్టుకుని, సూట్ కేస్ జాగ్రత్తగా చూసి, సిగరెట్టు అంటించి, దావా విషయాలు ఆలోచిస్తున్నాడు.

టీకు టాకుగా ఉన్న ఓ తెలుగమ్మాయి గర్జాగా ఇంగ్లీషు నవల చదువుతూ చీర సర్దుకుంది. పెట్టెలో జనంతో కదులుతూన్న రైలు హోరుకు ఉపశ్రుతిగా కబుర్లు విప్పేసింది. రామదాసు చల్లగాలికి కునకడం ప్రారంభించాడు. సూళ్ళూరుపేటలో ముఖం కడిగి, నాలిక కాలే కాఫీ తాగి, పొన్నేరిలో ద్వితీయ విఘ్నం కాకుండా చూసి, సెంట్రల్‌లో దిగాడు.

ఆ గాభరాలో ముందే దిగడానికి తయారై ఉన్న ఆ ఆడపిల్ల దిగిపోయింది, పెట్టె తీసుకునీ, హోల్డాల్ తీసుకునీ.

రామదాసు సూట్ కేస్ తీసుకుని నెమ్మదిగా ట్రాం మీద టౌన్‌కు వెళ్ళి హైకోర్టుకు దగ్గరగా ఒక హోటల్‌లో దిగి, గది చూసుకుని, స్నానం చేద్దామని పెట్టె తియ్యబోయాడు.

"అరె!"

"పెట్టె మారింది"

ఓ నిమిషం కొయ్యబారి పోయాడు. ఎలా జరిగిందీ?

దావా ఏంకావాలి? దస్తావేజులూ, దస్తావేజులతో ఉన్న రెండు వందలకూ నీళ్ళ ధారేనా?

బుర్ర పనిచేయడం మాని, కొయ్యబారింది.

వో సిగరెట్ తగలేసి, సరే—యీ పెట్టె ఎవరిదో వారిని కనుక్కుంటే తెలుతుంది గదా అని చూశాడు. చూస్తే—సరీగా తన తాళం లాంటి తాళమే. తాళం చెవి పర్సులోంచి తీసి, తీశాడు, వొచ్చింది

"ఖుదా! సూట్ కేస్ ఆ స్త్రీది!" అన్నీ ఫ్రాకులూ, స్కర్ట్లూ, చీరలూ, దువ్వెనా, అద్దం, తలనూనె, షోకైన చెప్పులూ, చేరుమాళ్ళూ, తువాళ్ళూ, వొళ్ళంతా చిరచిర లాడుతోంది. పేలి వుందేమో రెండు తువ్వాళ్ళు తీసుకుని స్నానం చేద్దామని తీశాడు గాని, ఆడదంటే హడల్ వల్ల ఆగిపోయాడు.

లేచి, పర్సు తీసుకుని, గదితాళంవేసి, బట్టల దుకాణంకేసి వెళ్ళి నాలుగు ధోవతులూ, నాలుగు రెడీమేడ్ షర్టులూ, రెండు తువ్వాళ్ళూ కొనుక్కుని, యింటికి రిక్షాగాం ఇచ్చి వొచ్చాడు.

కొన్నసామాను మంచంమీద పారేశాడు. తువ్వాలాలు తీసుకుని స్నానాల గదికెళ్ళాడు. సబ్బు?

మళ్ళీ గదిలోకి వొచ్చి, బెరుకు బెరుకుగానే ఆవిడ పెట్టెలోని సబ్బు తీసుకెళ్ళాడు. తోముకుంటూంటే—ఏం పరిమళం? మాహాయిగా ఉంది!

స్నానంచేసి, ఆమె తల నూనెతోనే తల దువ్వుకుని, గది తాళం వేసి, కాఫీతాగి, భోంచేసి, గదికెళ్ళాడు.

తల ఎంత సువాసనగా ఉంది? ఈ ఆడపిల్లలు—ఈ కాలంలో మరీను ఏం గుబాళిస్తూ ఉంటారు.

కనురెప్పమీద ఉయ్యాల ఊగుతోంది నిద్ర. మంచం మీద బట్టలు సర్ది, చిరాకు, చిరచిరలతో నిద్దర పోయి లేచాడు.

నా పెట్టె పోయిందంటూ ఎవ్వరూ రాలేదు. తనే వెతుక్కుంటూ పోయి ఇస్తే— ? ఎవరికనీ ఇవ్వడం?? ఎవరిదో తెలుస్తేగా?

అడ్రసైనా దొరుకుతుందేమోనని ఆ సూట్ కేస్ అంతా గాలించాడు. చీరలు తీశాడు. అన్ని తీశాడు. అవన్నీ మల్లెపూలలాగా పరిమళించడమే గాని, ఏమీ చెప్పవు. మల్లెపూలైనా మేలే—తర్వాత కథ చెబ్తే.

పెట్టె ఎంత కెలికినా కాజా అంత అయినా ఆచూకీ తెలీలేదు.

రామదాసు అవన్నీ అలాగే సర్దబోయి, ఓడిపోయి, వొక్కటే దీక్షగా వాసన చూసి, కప్పుకుని చూసి, ఆనక సర్దుదాంలే అని బట్టల స్టాండుమీదే పారేసి గది తలుపు తాళం వేసి, బయిటికి వెళ్ళాడు.

కాఫీ హోటల్, ఆక్వేరియం, బీచి, సినీమా అన్నీ చూసి రాత్రి గదికి చేరుకుని, తన కోసం ఎవరైనా వొచ్చారా అని గుమస్తాను అడిగి వాడు తనకు తెలీదంటే- వెళ్ళి భోంచేసి పడుకున్నాడు.

రాత్రంతా కలలు, భయం, దిగులు, విచారం, ఆనందం, నేలా, వేళా, విడిచిన చోట్లు, గమత్తు గమత్తు కలలు—అన్నీ తనకు తెలీనవీ_ తెలిసినవీ అదో ప్రపంచం.

తెల్లారింది.

"సాయంత్రం మీ కోసం ఎవరో వొచ్చారు సార్" అంటూ బాయ్ చెప్పాడు.

"ఎవరు?"

"ఎవరో, తెలుంగే మాట్లాడారు స్త్రీ"

పాపం, ఆవిడా సూట్ కేస్ కోసం వేటాడుతోంది కాబోలు!

అరె! తను లేనప్పుడు వచ్చిందే? అవిడేం కలకన్నదా.... తాను లేని పైం అని!

మని ఆర్డరేమన్నా వొచ్చిందా అని రామదాసు హోటల్ మేనే జర్ను కనుక్కున్నాడు. రాలేదుట. ఎందుకు కట్టలేదు చెప్మా? పెలిగ్రాం మని ఆర్డరు ఇమ్మన్నాడే? అంతా స్పష్టంగా రాశాడే! మోసం జరిగింది -మూడువందలు పంపమన్నాడుగదా.సుభద్ర ఎందుకు పంపలేదు చెప్మా? ఇంట్లో సొమ్ము కట్టడం కాని,ముష్టెత్తినట్టు మరేం నోటురాసి తేవాలా?

సుభద్ర బద్ధకించి ఉంటుందా? సుభద్ర- బద్ధకించడమే? కాప రానికి వొచ్చింది మొదలు కంటికి రెప్పకాదూ!

మద్రాసు వీధులప్పుడే కల కలలాడుతున్నాయి. ముష్టి వాళ్ళు తమల పాకు నోళ్ళతో తరమడం ప్రారంభించారు. బస్సులు చెడుగుడు ఆడు తూన్నై. సుభద్ర యీ ఊరు చూస్తేనా? వారం రోజులదాకా కదలదు. ఊరంతా తిరిగి గాని కొంపకు చేరుకోదు. ఆడవాళ్ళ పాపం అణిచి పెట్ట బడ్డారు గానీ.— అన్యాయం! సగం జనాభా చదువు లేని దైందయ్యే.

రామదాసు మనస్సు పిచ్చాడి మనస్సంత పదునుగానూ ఆలోచి స్తోంది. ఓ చోట కూచోనీకుండా లోపలనించి ఆవేశం లాంటిది తన్ను తోంది. కాలు కాలిన పిల్లిలా, పేవ్‌మెంట్ల పైన అటూ ఇటూ నడిచి, బ్రాడ్వేకు వెళ్ళి పత్రిక కొనుక్కుని చదివి, గదికి వచ్చాడు. మెయిలు అప్పుడే వొచ్చి అరగంట అయిందిట.

దేహబాధ తీర్చుకుందామని లేచి అలాగే స్నానం చేసి రావచ్చు కదా అనుకుని సరేలే—స్నానానికి వొచ్చే వెళ్ళచ్చులే అని గది తలుపులు వేసి, వెళ్ళి నెమ్మదిగా అడుగు లేసుకుంటూ వొచ్చాడు. ఈ మద్రాసులో అదోటి అసయ్యం. మంది మనమే నీళ్ళతో కొట్టెయ్యాలి. ఏం, అస య్యంలే. అలవాటులేక గాని, అయితే చాలా మంచిది కదూ? రామదాసు కాలుస్తూన్న సిగరెట్ పీకను అవతల పారేశాడు. గదిలోకి వొచ్చాడు.

తువ్వాలా చుట్టుకుని నిన్నటి సబ్బే తీసుకుని, తలుపులు వోరవాకిలిగా వేసి స్నానాల గదిలోకి ఏదో సినిమా పాట పాడుకుంటూ వెళ్ళాడు.

* * *

సుభద్ర వెతుక్కుంటూ వొచ్చింది. ఊరుకొత్త. తిరిగి తిరిగి అలసిపోయింది. ఏడుపు వొస్తోందన్నమాట: బింకానికీ, మనుష్య అజ్ఞాత ప్రయత్నానికీ ఆ ఏడుపు ఇగిరిపోతోందిగాని.

మోసం జరగడమేమిటీ—వెళ్లిన్నాడే మళ్ళీ మూడువందలు పంప మనడం ఏమిటి? ఏమిట్రా మోసం? మోసమే జరిగితే యీ దావా గంగలో కలిసినట్టేనా? ఇంత మైమరుపు మనిషైతే ఎలాగమ్మా కాపరం తగలడ్డం? తను కంటికి రెప్పగా కాపాడ్డం బట్టిగాని, లేకపోతేనా—ఎట్లా యీమనిషితో వేగడం? అక్కడికీ గైలు కదిలేదాకా శతపోరి చెప్పిందిగదా.

దయ్యమంత సెంట్రల్ స్టేషనులో దిగి, లక్ష్మయ్యగారు మైలా పూరులో గనుక మైలాపూరు స్టేషనె దగ్గిరరోడ్డు క్రాస్‌చేసి—వెళ్ళింది వెతుక్కుంటూ.

ప్లీడరుగారుఇంట్లోనే ఉన్నారు. యింకా యీన ప్లీడరుగార్ని కలుసు కోనే లేదన్నమాట. తను వెళ్తే పని ఛప్పున నిమిషాల్లో తెమిలిందే. యీ మగాళ్లు ఇంతే. ఇంట్లో దబాయిస్తారుగాని బయిటికొస్తే బహు మెతక. ఇట్టే నానిపోతారు.

గుమాస్తా నిమిషంలో డైరీ చూసి చెప్పాడే—అవతలిపార్టీ మళ్ళీ వాయిదా అడగచ్చనీ, వాయిదా పడవచ్చనీ. తను వాయిదా కోరమంది:

మరి, ఏం చేస్తుంది? దస్తావేజులూ, డబ్బుతెచ్చిన మొగుడూ.... మోసం జరిగింది. మళ్ళీ డబ్బు పంపమని టెలిగ్రాం ఇచ్చె.

ఇంకానయం, తను తెస్తుందని తెలీక. టెలిగ్రాం మని అర్థం రాలేదని ఏం ఏం తిట్టుకుంటున్నాడో. తిట్టడులే. ఆయనకు తిట్టడం చాత

కాదు. లోపల్లోపల పదిసార్లు అనుకుంటారు. ఇంతకూ ఆ మోసం ఏమిటీ—ప్లీడర్ని గూడా చూడకుండా ఈన హోటల్లో ఏంచేస్తున్నట్టు? కిందటిసారి దిగిన హోటలు ఫలానా అని చెప్పాడు గుమాస్తా. యీసారీ అక్కడే దిగాడు. టెలిగ్రాంలో అడ్రస్ ఇచ్చాడుగా!

అక్కడ ఎవత్తినన్నా మరిగాడా? ఛ! ఎవత్తె నమ్మింది మగాళ్ళని? బాగానే ఉంది కథ!

బస్సులో కూచ్చుని దిగే వరకూ యీ ఆలోచనలోనే సుభద్ర తన్ను తాను మరిచింది. బస్సువాడు హైకోర్టు అని అరవకపోతే తను దిగేదేకాదు.

హోటల్ వెతకడం ఏం కష్టంకాలేదు. గదినెంబరు తెలుసుకుని, హోటలు కుర్రాడు చూపించగా గదిలోకి వెళ్ళింది సుభద్ర.

గది తలుపు వోరవాకిలిగావేసి ఉంది. ఇంకేం? మహారాజు లోపల తింగురంగా అని నిద్రిస్తున్నాడుకాబోలు.పాపం.రాత్రిఅంతాఅలిసిపోయి.

గదిలోకి అడుగుపెట్టాక సుభద్ర ప్రాణాలు చివ్వుమన్నాయి. తన మొగుడేనా ఇక్కడ ఉంటా? ఆహా! ఆ కోటు ఆయందే. సుభద్రకు అసహ్యం ముంచుకొచ్చింది. పరాయి ఆడదాంతో భర్త కులకడం, ఇదా జరిగిన మోసం? ఇందుకా మూడు వందలు? వందలు కాదు; బొందలు! దాని ఎదాన కొట్టడానికా?

గదినిండా చీరలూ, జాకెట్లూ, అందమైన చెప్పులూనా? గర్భాదానం గది లాగు సువాసనలా? ఇంతకూ ఆ మహా ఇల్లాలెక్కడకెళ్ళిందీ? వీపు రుద్దడానికా? స్నానం చేస్తున్నారటగా అయ్యగారు? ఇంతకూ ఎవత్తె అది? మొన్న రైల్లో రాకుతీకుగా ఎక్కిన సన్నెల విసనకర్రా? అదే అయి వుంటుంది. తను దిగ్గానే దాంతో సరసాలాడి, ఆడించి, మరిగి, మరిగించి ఉంటాడు. ఇంతే, మగాళ్ళ జన్మ! తను ఎంతకాలం

గోతిలో పడ్డది? ఏకపత్నీవ్రతం, ఆర్టు అంటూ ఉపన్యాసాలిచ్చేవాడే రామదాసుగారు!!

సుభద్ర స్టాండుదగ్గరకువెళ్ళి చీర చూసింది. మెరమెరలాడుతూ.. చక్కగా కడిగిన ముత్యంలా ఉంది చీర. చెప్పులు చూసింది. ముద్దొస్తున్నై. బాడీలూ, రవికలూ చూసింది. నలక్కుండా గుభాళిస్తున్నై. స్నానం చేసి వేసుకోడానికి బయటకు తీసి ఉంటుంది. తలనూనె చూసింది. ఏం పరిమళం. ఇల్లా డబ్బులు తగలేస్తాడు కాబోలు! ఇంటో తెమ్మంటే పోరితేగాని తీసుకురారే?

* * *

"నమస్కారమండీ"

మొగుడిగొంతుకే! ఆ కొత్తదాన్ని ఇలా పిలుస్తాడు కాబోలు. ఏడుపొస్తోంది.

"దాన్నేనా?"

ఉరిమింది సుభద్ర.

చెప్పులు విడిచి గదిలోకి వచ్చాడు రామదాసు.

"ఎప్పుడు వచ్చా?" అన్నాడు.

"ఏం రావడం ఇష్టంలేదా?"

"అల్లా మాట్లాడతావేం?"

.... .... .... ....

"రైల్లో మేల్కొని ఉంటావు. స్నానం చేద్దుగాని రా"

"దాన్ని రానీండి, చూసి మరీ పోతాను"

"అది ఎవత్తె— పిచ్చిదానా?"

"పిచ్చిదాన్ని గనకనే ఆడిస్తున్నారు."

సుభద్ర గొంతు రోషంతో కషాయితంఐంది.

"ఓహో!— ఆమె ఇంకా రాలేదు."

అంటూ భార్యదగ్గరికి వొచ్చాడు రామదాసు.

"నన్ను ముట్టుకోకండి— అది అనగూడదేం? ఆమె- గుడిశేటి ముండను!"

"ఛా! పిచ్చిదానా— ఎవ్వరూ లేరు"

"లేకేం?"

"ఏఁవిటీ వెఱ్రి" అంటూ భార్యను రామదాసు సముదాయిస్తు న్నాడు మాటలతో, ధోతీ కట్టుకుంటూ.

"ఈ భాగోతం ఏమిటండీ—" అంటూ సుభద్ర అడిగింది. గొంతుక ఆక్రోశిస్తోంది. మాట కాలుతూ వస్తోంది. బొడ్డు దగ్గర్నించీ నాదం పలుకుతోంది.

"అదుగో— ఆమె— వి— పెట్టెలు మారాయి. నిన్న నాకోసం వచ్చిందిట—"

"ఊఁహూఁ, వొచ్చిందీ మీకోసం? ఇంకేం?"

"అదిగాదే"

"నన్ను ఇంకా గోతిలోకి తొయ్యకండి—" సుభద్ర కళ్ళంబడి నీళ్ళు కారుతున్నై.

రామదాసు దగ్గిరికొచ్చి, ముట్టుకుని వొళ్ళు నిమిరాడు. తల రొమ్ముకు ఆన్చుకున్నాడు. సుభద్ర వెక్కుతోంది.

ప్రసంగం తప్పిస్తే మంచిదని రామదాసు "వొళ్ళు ఇల్లా పేలిందేం?" అంటూ సుభద్ర మెడ ఎత్తాడు.

"పనికిరానప్పుడు పేలితే ఏం— కాలితే ఏం?" ఏడుస్తూనే అంది సుభద్ర.

రామదాసుకు ఏమీ పాలుపోవటంలేదు. తను ఎవత్తెతోనో ఉంటున్నానను కుంటోంది సుభద్ర. రామదాసుకు అర్థమై, మరీ దిగులేస్తోంది. ఏం గ్రహచారం: తన్ను భార్య అనుమానించడం? పోయిన డబ్బు పోగా, కోర్టు కాయితాలూ, దస్తావేజులూ ఏమైనయ్యో అంతు లేకపోగా భార్య అనుమానించడమా?

"ఒసే, నన్ను నమ్మే—"

"ఎందుకండీ నమ్మడం, కళ్ళతో చూస్తూ—"

"టెలిగ్రాం అందగానే, గాబరాపడి, మెయిలుకు వొచ్చావా...."

"ఆc, చూసి సంతోషిద్దామని అంగలేసుకుంటూ వొచ్చాను."

"నీకేదో తిక్క తిరిగింది—ఇది నీ అంతట నీకు పోవాలిసిందే."

"పోనీండిగాని, మీరు ప్లీడరు గారింటికి వెళ్ళారుటండీ?"

"ఉc హుc హ్."

"దాని వలలో పడకపోతే వెళ్ళకుండా ఉండేవారేనా? నేనిటు వెళ్ళి, రైలు కదలగానే, అది మీకు ఉచ్చులు పన్నింది కాబోలు?"

"మళ్ళీ ఎగరొప్పుతున్నావు. అది ఎవత్తో నేను ఎరగను:"

"రామాయణం అంతా అయినా రాముడికి సీత ఎవత్తో తెలియదట —అలా ఉంది."

"నువ్వెప్పుడూ ఇంతే. చెబితే వినవు."

"నీ మీద మరొక్కతెపై నిను వినా నే నెక్కడన్ చొక్కనే." అని శివుడే అబద్ధాలాడాడు పార్వతితో—మీరు లెక్కా?"

"కవి రాశాడు అది. అంతే. దస్తావేజూలూ, డబ్బూ లేందే ప్లీడరును ఎలా చూట్టం?"

"నేను మాట్లాడి రాలా?"

"ఎప్పుడొచ్చావూ—ఎప్పుడు వెళ్ళి మాట్లాడావూ?"

"మరేం చెయ్యనూ? మొగుడు మోపిదేవి పోతే—"

ఇద్దరికీ వొచ్చింది నవ్వు. సుభద్ర బల్లెం గుచ్చినట్లు కళ్ళతో చూసి నవ్వు ఆపుకుంది. రామదాసు నవ్వుతున్నాడు.

"ఏమన్నాడూ ప్లీడరు?" అన్నాడు నవ్వాపి రామదాసు.

"ఎగస్పార్టీ వాయిదా కోరవచ్చట. గుమాస్తా చెప్పాడు. దస్తావేజూలూ, డబ్బూ, మొగుడూ, పరారీ కనుక నేనూ వాయిదా కోరండని రెండువందలూ జమ కట్టించి వొచ్చాను."

రామదాసు భార్యను దగ్గిరికి తీసుకుని ముద్దెట్టుకున్నాడు.

"వొళ్ళంతా పేలింది—మీకు పనికి రాదు కాబోలు."

రామదాసుకు నవ్వు వొచ్చింది.

"ఫరవాలేదు, నాకూ పేలిందిలే—కాస్త గంధం కలుపుదుగాని ఆనక్క" అన్నాడు నవ్వుతూ.

"నవ్వు ఎలా వొస్తుందండీ? అది వొచ్చి కలిపి పూయమూ గంధం." అంది సుభద్ర ఈసుగా.

"పిచ్చిదానా, నేనే ముండను—నాకేం ముండే" అన్నాడు.

"పిచ్చాడు నీకు పిచ్చి అంటే వొప్పుకుంటాడా?" అంది సుభద్ర.

రామదాసు స్తబ్దుగా ఉన్నాడు. లోపల ప్రేమ సముద్రం ఆటూ పోటూ—పోటుకోసం ఆటు తీస్తుంది.

"ఈ చీరలూ, తలనూనే దానివేనా?"

"ఏం, ఏం?"

"కొన్నారేమోనని"

"దానివే."

"ఎలా నోరొచ్చిం దండీ దానివే అని చెప్పడానికి."

రామదాసు కొత్తగా విమానాన్ని చూసినట్లు చూస్తున్నాడు భార్య మొహాన్ని. ఎర్రదనం పోతోంది. మామూలు పచ్చదనం వొస్తోంది.

*　*　*　*

"రామదాసు గారున్నారా?"

"ఆఁ. ఎవరో? రండి!"

ఆకు చెప్పులతో వొక విద్యాసుందరి వొచ్చింది. తన చీర స్టాండు మీద ఉండటం చూసి, ఆమె మొహం మారుతోంది. సుభద్ర కొంచెం పక్కకు తప్పుకుంది.

పరిస్థితులు ఎంత ఆడించినా, మళ్ళీ స్వభావమే పరిపాలించేది మరి!

"క్షమించండి! నిన్న పొద్దున మీ పెట్టె పొరపాటున నా పెట్టె అనుకుని తీసుకెళ్ళాను."

"తమదా? స్టేషన్ దిగి, నాదేగదా అనుకుని తెచ్చుకున్నానండీ!"

"సారీ. నా రూంకువెళ్ళి మామూలుగా తీశాను. తాళాలు కూడా ఒకరకమల్లే ఉంది. ఈజీగానే వొచ్చింది."

సుభద్ర లోలో రగులుకుంటోంది. ఏం మోసం?

"నిజం" అన్నాడు రామదాసు.

"ఏం? మీకూ అంతేనా?" అంది ఆమె.

"ఎగ్జాక్ట్లీ" అన్నాడు రామదాసు.

సుభద్ర ఆ ఇంగ్లీషు మాటకు తల ఎత్తింది, చెవితో చూస్తున్న పాములా.

"చూస్తే, నాది కాదండీ! సరే అని, గాభరా పడ్డాను."

"నేనూ అంతేనండీ. బజారు వెళ్ళి, బట్టలు కొనుక్కొని, రోజు గడిపాను. బట్టలూ, సబ్బూ, కాయితాలూ అన్నీ అందులోనే ఉన్నై," అన్నాడు రామదాసు.

"అవునండీ. రెండు వందల యాభై రూపాయలు ఉన్నై. తెచ్చాను." అంది ఆమె.

సుభద్రకు నమ్మకం కుదురుతోంది.

"మీ అడ్రసన్నా దొరకుతుందేమోనని మీ పెట్టె అంతా కెలికానండి. ఉహుం. సరిగ్గా సర్దడంకూడా చాతకాక, అవల్లాగే ఉంచాను." అన్నాడు రామదాసు.

ఆమె కొంచెం నవ్వింది.

సుభద్ర "ఆడవాళ్ళ పెట్టెలు మొగాళ్ళు సర్దలేకేం" అని దర్జాగా అంది.

"మా స్నేహితురాలి బట్టలు వేసుకుని, మీ అడ్వొకేట్ ఇంటికి వెళ్ళి—" అంది ఆమె.

"మీరు వెళ్ళారా?" రామదాసు.

"ఆఁ. వాయిదాకు రమ్మని రాసిన కార్డు ఉందికదూ. డబ్బూ, దస్తావేజులూ తెలుస్తున్నయ్యాయే. వెళ్ళాను మరి." బరువు దించుతున్నట్లు అంది ఆమె చివరి మాట.

"నే వెళ్ళలేదులెండి" అన్నాడు రామదాసు.

"అదే. మీరు రాలేదనీ, వొస్తే ఫలానా చోట మామూలుగా దిగుతారనీ గుమస్తా చెప్పారు. వెంటనే రాలేక—"

"సాయంత్రం వచ్చారన్నమాట. నిన్న వొచ్చింది తమరేనా?" అని అందుకున్నాడు రామదాసు.

ఆమె అతని సూట్ కేస్ ఇచ్చి, డబ్బు వేరే ఇచ్చింది.

"క్షమించాలి. మీ పెట్టె తీశాను—" రామదాసు అన్నాడు.

"నేనూ తీశానుగా క్షమాపణ దేనికండీ!" అంది ఆమె.

"మీ సబ్బు, తలనూనె వాడాను. చీరలూ అవీ విచ్చల విడిగా పారేశాను."

"నో మేటర్. దాందేముందిలెండి. ఇంతకూ మీరెంత ఆదుర్దా పడ్డారో, కోర్టు కాయితాలు కూడాను!"

సుభద్రకు కొత్త ఆమె మీద అభిమానం కలిగింది. దస్తావేజుల మీద ఆమెకున్న శ్రద్ధ మొగుడి కుండకూడదూ! రామదాసు తలనూనె సీసా, దువ్వెనా తెచ్చిఇచ్చాడు. ఆమె చీరలూ, అవీ మడతలు పెడుతోంది.

"థాంక్యూ"

"థాంక్యూ"

"ఇదుగో, చెల్లీ, ఫోంచేసి పోదుగాని—" అంటూ సుభద్ర.

"కాదండీ, పనిఉంది, వెళ్ళాలి" అంటూ కొత్త ఆమె.

"ఊంహూ. వెళ్ళడానికి వీల్లేదు" అంటూ ఫోంచెయ్యడానికి వొప్పించి, సుభద్ర మొగుడి పెట్టెలో తన యింటి తువ్వాలాలు తీసుకుని, మొగుడికేసి తృప్తిగా చూసింది.